క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రెంజల్(బోధన్)/పెర్కిట్(ఆర్మూర్): రెంజల్ ఆదర్శ కళాశాలకు చెందిన విద్యార్థిని వైష్ణవి, ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు సాయితేజ, బాలరాజ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్‌లో క్రీడాకారులు తమ ప్రతిభ చాటారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు సిద్దిపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని రెంజల్ కళాశాల పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ బలరాం, ఎస్‌ఎంసీ చైర్మన్ నాగరాజు వైష్ణవిని అభినందించారు.

హ్యాండ్‌బాల్..



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పిప్రిరోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–19 హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ దుర్గారెడ్డి తెలిపారు. ఈ నెల 2న నిర్వహించిన సెలక్షన్స్‌లో రాజేశ్, సాయికిరణ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను వైస్ ప్రిన్సిపల్ సంధ్యారాణి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజేందర్, అర్జున్ అభినందించారు.

కేజీబీవీ తనిఖీ

బాల్కొండ: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ప్యానల్ టీం సభ్యులు గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను, తరగతి, వసతి గదులు, నిత్యావసర సరుకులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజేశ్వర్, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి గంగమ్మ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



ఎడపల్లి(బోధన్): మండలంలోని జైతపూర్‌లో బోనాల పండుగను గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. ప్రతిఏడాది పంటలు చేతికొచ్చిన సమయంలో బోనాల పండుగ నిర్వహించడం ఆనవాయితీ కావడంతో పండుగను ఘనంగా నిర్వహించారు.

తడిసిన ధాన్యం



మాక్లూర్: అకాల వర్షం కారణంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఆరబోసిన ధాన్యం తడిసింది. మండలంలోని మానిక్‌బండార్, కృష్ణానగర్, మాక్లూర్, అమ్రాద్, అడవి మామిడిపల్లి, చిన్నాపూర్ గ్రామాల రైతులు ధాన్యం తడకుండా కాపాడుకునేందుకు అవస్థలుపడ్డారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు. అడవిమామిడిపల్లి, మానిక్ బండార్, బోర్గాం (కె) గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని సీపీఎం నాయకులు పి వెంకటేశ్, కొండ గంగాధర్ గురువారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. వారివెంట ఇడగొట్టు సాయిలు, రైతులు ఉన్నారు.

పోలీసుల భారీ బందోబస్తు



బోధన్‌టౌన్(బోధన్): నామినేషన్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పట్టణంలో గురువారం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అడిషనల్ డీసీపీ జయరాం మాట్లాడుతూ.. ఎన్నికల రిటర్నింగ్ అధికారి బీజేపీకి ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు, బీఆర్‌ఎస్‌కు మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, కాంగ్రెస్‌కు మధ్యాహ్నం 2 నుంచి 3:30 గంటల వరకు సమయాన్ని కేటాయించారని తెలిపారు. సీపీ ఆదేశాల మేరకు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సీఏపీఎఫ్, స్పెషల్ పార్టీ సిబ్బందితోపాటు 200 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నట్లు ఆయన వివరించారు. లాఅండ్ ఆర్డర్ డీసీపీ రఘురాజ్, పోలీస్ ట్రైనింగ్ అధికారి శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

మూడోసారీ అధికారం ఖాయం

- దక్షిణ భారత దేశంలో రికార్డు నెలకొల్పాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

బోధన్: తెలంగాణలో బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్ ఆమేర్‌తో కలిసి పట్టణంలోని నామినేషన్ కేంద్రం మీడియా పాయింట్ వద్ద కవిత మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా గులాబీ వేవ్ నడుస్తోందన్నారు. కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేసి దక్షిణాభారత దేశంలో రికార్డు సృష్టించాలని ప్రజలను కోరారు. నామినేషన్ ర్యాలీ విజయయాత్రలా ఉందని, తమ పార్టీ అభ్యర్థి షకీల్ గెలుపు ఖాయమని పేర్కొన్నారు. అభ్యర్థి షకీల్ మాట్లాడుతూ.. మూడోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటానన్నారు. తనది వన్‌సైడ్ గెలుపు ఖాయమని, ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులకు డిపాజిట్లు దక్కవన్నారు. ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, పార్టీ సాలూర మండల అధ్యక్షుడు గోగినేని నరేంద్రబాబు ఉన్నారు.



బోధన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్‌తో ఎమ్మెల్సీ కవిత

నిజాంషుగర్స్‌ను తెరిపిస్తాం

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ సామాజిక న్యాయానికి పాతరేశాయి
- ఎంపీ ధర్మపురి అర్వింద్

బోధన్: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే మూతపడిన బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఆ పార్టీ ఎంపీ ధర్మపురి అర్వింద్ హామీ ఇచ్చారు. చంద్రబాబు ఫ్యాక్టరీని అమ్మివేస్తే, కేసీఆర్ ఫ్యాక్టరీని పూర్తిగా మూసివేశారని విమర్శించారు. బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న ఆయన అంబేద్కర్‌చౌరస్తాలో మాట్లాడారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ తడిగుడ్డతో బీసీ నాయకుల గొంతుల కోశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇందూరుగడ్డపై బీసీ నాయకులు అర్గుల్‌రాజారాం, డి .శ్రీనివాస్‌లను కాంగ్రెస్ రాజకీయంగా అణిచివేసిందని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ సామాజిక న్యాయానికి పాతర వేశాయన్నారు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ ఒక్క బీసీ నేతకు టికెట్ ఇవ్వలేదని, బాన్సువాడకు చెందిన బీసీ నాయకుడు కాసుల బాల్‌రాజ్ ఆత్మహత్యాయత్నానికి సుదర్శన్‌రెడ్డే కారణమని ఆరోపించారు. మహిళ రిజర్వేషన్ పేరుతో ఎమ్మెల్సీ కవిత డ్రామా చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర నాయకుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, నాయకులు అడ్లూరి శ్రీనివాస్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



పార్టీ అభ్యర్థి మోహన్‌రెడ్డితో ఎంపీ అర్వింద్

ప్రాజెక్టుల పేరుతో దోపిడీ

- కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదించాలి
- కాంగ్రెస్ అభ్యర్థి పి సుదర్శన్‌రెడ్డి

బోధన్: ప్రాజెక్టుల పేరుతో కోట్లు దోచుకున్నారని, కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో గురువారం సాయంత్రం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, పార్టీ ప్రకటించిన ఆరుగ్యారంటీలను అమలు చేస్తామన్నారు. మోదీ, కేసీఆర్ ఎన్నికల హామీలను విస్మరించారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణ అంధకారమవుతుందని, కరెంట్ ఉండదని బీఆర్‌ఎస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని, కరెంట్ ప్రాజెక్టులు కాంగ్రెస్ కడితేనే కేసీఆర్ కరెంట్ ఇస్తున్నారన్నారు. కచ్చితంగా రైతులకు ఉచిత కరెంట్ ఇవ్వడంతోపాటు రూ.2 లక్షల పంట రుణాలను మాఫీ చేస్తామన్నారు. వైఎస్‌ఆర్ కట్టించిన బాసర ట్రిపుల్ ఐటీ ఇప్పుడు నిర్లక్ష్యానికి గురవుతున్నదని, కేసీఆర్ ప్రభుత్వం విద్యార్థులకు సరైన భోజనం పెట్టడం లేదన ఆవేదన వ్యక్తం చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన షకీల్ ఆగడాలు మితిమీరాయని ఆరోపించారు. తనను ఆశీర్వదించి గెలిపిస్తే రాజీలేకుండా పని చేస్తానని, ప్రజలకు అండగా ఉంటానని అన్నారు. కార్నర్ మీటింగ్‌కు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్ర నాయకుడు తాహెర్ బిన్ హందాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తున్న సుదర్శన్‌రెడ్డి

నిరాడంబరంగా నామినేషన్

బోధన్‌టౌన్(బోధన్): కాంగ్రెస్ తరఫున సుదర్శన్‌రెడ్డి నిరాడంబరంగా నామినేషన్ దాఖలు చేశారు. కూతురు రచనారెడ్డితోపాటు నాయకులతో ఆయన రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చి నామినేషన్‌పత్రాలను అందజేశారు. రాజ్యాంగం పౌరులందరికీ ఓటు హక్కు కల్పించిందని, బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని మంచి నాయకుడిని ఎన్నుకోవాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ గెలుపుతోనే విముక్తి

- బాల్కొండ అభ్యర్థి ముత్యాల సునీల్

భీమ్‌గల్: కాంగ్రెస్ గెలుపుతోనే బాల్కొండ నియోజకవర్గానికి బానిస సంకెళ్ల నుంచి విముక్తి లభిస్తుందని ఆ పార్టీ అభ్యర్థి ముత్యాల సునీల్ అన్నారు. కాంగ్రెస్ తరఫున సునీల్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత చదువులు చదివిన మీ పిల్లలు నిరుద్యోగులుగా మిగలకుండా, వారికి ఉద్యోగాలు రావాలంటే కాంగ్రెస్‌ని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి అవినీతికి అంతులేకుండా పోతోందని, అభివృద్ధి పేరుతో ప్రతి పనిలో కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. చెక్ డ్యాములను నాసిరకంగా నిర్మించడంతో రైతులు చాలా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలోని హామీలను అమలు చేస్తామన్నారు. మాజీ విప్ ఈరవత్రి అనిల్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ను నమ్మి మోసపోయామని, వందల కోట్ల అవినీతి చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. సునీల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, కిసాన్ కేత్ నాయకుడు అన్వేష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బొదిరె స్వామి, కాంగ్రెస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నాగేంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ముత్యాల సునీల్

గులాబీమయమైన ఆర్మూర్

- పట్టణంలో బీఆర్‌ఎస్ శ్రేణుల భారీ ర్యాలీ

ఆర్మూర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి నామినేషన్ ర్యాలీకి నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ధోబీఘాట్ నుంచి ఆలూర్ రోడ్డు, కాశీ హనుమాన్ మందిరం, గోల్ బంగ్లా, పాత బస్టాండ్ మీదుగా నామినేషన్ల స్వీకరణ కేంద్రం వరకు ర్యాలీ కొనసాగింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, నాయకులు డాక్టర్ మధుశేఖర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినిత తదితరులు పాల్గొన్నారు. ర్యాలీకి ముందు కుటుంబ సభ్యులతో కలిసి మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేసిన జీవన్‌రెడ్డి, ర్యాలీ తరువాత రెండో సెట్‌ను అందజేశారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని రూ.3వేల కోట్లతో అభివృద్ధి చేశానని, తనకు ఈ అవకాశాన్ని కల్పించిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. తనను మరోసారి ఆశీర్వదించి హ్యాట్రిక్ విజయాన్నందించాలని నియోజకవర్గ ప్రజలను కోరారు.



నామినేషన్ ర్యాలీలో బీఆర్‌ఎస్ శ్రేణులు

బోధన్‌లో ప్రధాన పార్టీల ర్యాలీలు



బోధన్‌లో బీఆర్‌ఎస్ ర్యాలీ



ర్యాలీకి హాజరైన బీజేపీ శ్రేణులు



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

బోధన్‌టౌన్(బోధన్): బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు గురువారం బోధన్‌లో నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగ ఆయా పార్టీల ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీలు నిర్వహించారు. పార్టీల జెండాలు, బైక్‌ల హారన్లమోతతో పట్టణం సందడిగా మారింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్ ఏరా గార్డెన్ నుంచి నామినేషన్ ర్యాలీని ప్రారంభించగా, ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థి ఏకచక్రనగర్ చౌరస్తా నుంచి ర్యాలీని ప్రారంభించగా, ఎంపీ ధర్మపురి అర్వింద్‌తోపాటు నిజామాబాద్ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి నామినేషన్ ర్యాలీ పట్టణ శివారు నుంచి ప్రారంభమైంది. మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి, తాహెర్‌బిన్‌హందాన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండి

బాల్కొండ: రాష్ట్రంలో బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ బాల్కొండ నియోజక వర్గ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. ముప్కాల్ మండలం నల్లూర్, నాగంపేట్ గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడితే వేగంగా అభివృద్ధి కొనసాగుతుందన్నారు. పేదలకు రేషన్‌కార్డులు, ఇళ్లు పంపిణీ చేస్తామన్నారు. ఆమెకు ఆయా గ్రామాల్లో మహిళలు ఘన స్వాగతం పలికారు. కొత్తపల్లికి చెందిన పలువురు బీజేపీలో చేరగా, అన్నపూర్ణమ్మ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ మోహన్, మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్, పద్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నాగంపేట్‌లో మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

మంత్రి వేముల సమక్షంలో చేరికలు



వేల్పూర్: రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బాల్కొండ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. బాల్కొండ, మోర్తాడ్, ఏర్గట్ల, వేల్పూర్, భీమ్‌గల్ మండలాల్లోని గ్రామాల నుంచి వచ్చి వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బాల్కొండ రజకసంఘం, భీమ్‌గల్ మండలం ముచ్కూర్ గ్రామానికి చెందిన శివగంగ యూత్ సభ్యులు ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు.

రుద్రూర్‌లో నాయకుల ప్రచారం

రుద్రూర్: బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి కోరారు. రుద్రూర్ మండల కేంద్రంలో గురువారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పత్తి లక్ష్మణ్, ఎన్ బాల్‌రాజ్, గ్రామ అధ్యక్షుడు తోట్ల గంగారాం, బీసీ సెల్ అధ్యక్షుడు కొలస్ గంగాధర్, డౌర్ సాయిలు, సీతారాం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే కీలకం

మాక్లూర్: అభ్యర్థిగెలుపులో కార్యకర్తలే కీలకమని, ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఇన్‌చార్జి అభేదబేగం సూచించారు. మాక్లూర్‌లో గురువారం ఆమె కార్యకర్తలతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రానున్న 15రోజుల ప్రచారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. మండల ప్రచార కార్యదర్శి జైలసింగ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న పోచారం సురేందర్‌రెడ్డి

కొనసాగుతున్న నామినేషన్లు



బోధన్‌లో నామినేషన్ వేస్తున్న ఏఐఎఫ్‌బీ అభ్యర్థి నాగరాజు



భీమ్‌గల్‌లో నామినేషన్ వేస్తున్న డీఎస్పీ అభ్యర్థి మంగళారం భోజన్న

బోధన్/ఆర్మూర్/భీమ్‌గల్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. బోధన్ పట్టణంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు గురువారం నామినేషన్లు దాఖలు చేయడంతో సందడి నెలకొంది. పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి (కాంగ్రెస్), మహ్మద్ షకీల్(బీఆర్‌ఎస్), వడ్డి మోహన్‌రెడ్డి (బీజేపీ) ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో కలిసి నామినేషన్లు దాఖలు చేశారు. మోసిన్ (ఎంసీపీఐ-యూ), దేవర్ల నాగరాజు (ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్), మురళి శ్యాం (డీఎస్పీ) నామినేషన్లు వేశారు. ఆర్మూర్‌లో ఆశన్నగారి జీవన్‌రెడ్డి (బీఆర్‌ఎస్), ఎస్‌కే మాజిద్(మజ్లిస్ బచావో తెహ్రీక్) నామినేషన్లు దాఖలు చేశారు. బాల్కొండ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తరఫున ఆయన అనుచరులు ఒక సెట్ నామినేషన్, ముత్యాల సునీల్(కాంగ్రెస్), మంగళారం భోజన్న(డీఎస్పీ), పల్లికొండ నర్సయ్య(బీఎస్పీ) నామినేషన్లు వేశారు.

బీఆర్‌ఎస్‌కు ఓటమి భయం పట్టుకుంది

వర్ని: బాన్సువాడలో బీఆర్‌ఎస్‌కు ఓటమి భయంపట్టుకుందని, దీంతో వారు బీజేపీ ప్రచారాన్ని అడ్డుకుంటున్నారని బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ అన్నారు. వర్నిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత తొమ్మిదేళ్లలో ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఓడించి, బీజేపీకి పట్టంకట్టాలని ప్రజలు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఓటమి భయంతోనే పోచారం గ్రామంలో బీజేపీ ప్రచారాన్ని బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకున్నారని విమర్శించారు. ఈ నెల 10న బాన్సువాడలో కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్‌ముండాతో కలిసి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మహారాష్ట్ర బీజేపీ నాయకుడు ప్రవీణ్ గోరె, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దొరబాబు, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రవి, నాయకుడు చౌదరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి లక్ష్మీనారాయణ

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – ఘోస్ట్- 10.15, టైగర్ నాగేశ్వరరావు - 01.10, నరకాసుర (తెలుగు) - 04.35, ఘోస్ట్- 7.35, భగవంత్ కేసరి (తెలుగు) - 10.30
- స్క్రీన్-2 – మా ఊరి పొలిమేర-2 (తెలుగు) - 10.25, 1.15, 7.30, 10.20, లియో (తెలుగు) - 4.05
- స్క్రీన్-3 – కీడాకోలా - 11.20, 2.00,4.40,7.20, 10.00
- స్క్రీన్-4 – భగవంత్‌కేసరి(తెలుగు)-12.45,6.35, విధి (తెలుగు)-4.10, శంకర్‌దాదా ఎంబీబీఎస్ - 10.00

సంక్షిప్తం

బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభం

కమ్మర్‌పల్లి: మండలంలోని నాగాపూర్‌లో బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని పార్టీ మండలాధ్యక్షుడు రేగుంట దేవేందర్ గురువారం ప్రారంభించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సునీల్‌రెడ్డి గెలవాలని పూజలు

కమ్మర్‌పల్లి: బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి సునీల్‌రెడ్డి గెలవాలని కమ్మర్‌పల్లిలోని పెద్దగుట్ట నర్సింహస్వామి ఆలయంలో కాంగ్రెస్ నాయకులు పూజలు నిర్వహించారు. మెట్టుకో కొబ్బరికాయ చొప్పున 101 కొబ్బరికాయలు కొట్టారు. శివసరపు గణేశ్, బుచ్చి మల్లయ్య, నిమ్మ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వినయ్‌రెడ్డి నామినేషన్ ర్యాలీని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ విజయం కోసం కృషి చేయాలన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

నవీపేట: మండల కేంద్రంలోని దర్యాపూర్ కాలనీకి చెందిన సుంకపాక నర్సుబాయి గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. జనవికాస్ సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు తెడ్డు పోశెట్టి బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల కోసం రూ.5వేలు అందజేశారు.

బోధన్‌కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

రెంజల్(బోధన్): మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం బోధన్‌కు తరలివెళ్లారు. పార్టీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు సాటాపూర్ నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్‌ఖాన్ ర్యాలీని ప్రారంభించారు.

ఆర్మూర్‌కు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు

మాక్లూర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలంలోని ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆర్మూర్‌కు తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు బడుగు సత్యం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌ను వీడిన సర్పంచ్

ఎడపల్లి(బోధన్): మండలంలోని అంబెం (వై) గ్రామ సర్పంచ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పిస్క గంగాప్రసాద్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు సుదర్శన్ బీఆర్‌ఎస్‌ను వీడారు. పార్టీకోసం పనిచేస్తున్న తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. ఈనెల 12న గ్రామస్తులతో చర్చించి తమ నిర్ణయాన్ని వెల్లడిస్తామన్నారు.

యువ సమ్మేళనానికి తరలిరావాలి

రుద్రూర్: వర్ని మండల కేంద్రంలోని సీసీడీలో శుక్రవారం నిర్వహించనున్న యువ ఆత్మీయ సమ్మేళనానికి యువత తరలిరావాలని రుద్రూర్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు పత్తి లక్ష్మణ్, నేరుగంటి బాలరాజు కోరారు. ఉదయం 10గంటలకు ఆత్మీయ సమ్మేళనం ప్రారంభమవుతుందన్నారు.

హద్దు నిర్మాణంపై విచారణ

ఆర్మూర్‌టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో ఇంటి హద్దు నిర్మాణంపై నసీఫ్ సుల్తానా అనే మహిళ లోకాయుక్తలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు లోకాయుక్త సభ్యులు విచారణ చేపట్టాలని సీడీఎంఏ అధికారులను ఆదేశించారు. రీజినల్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి షాహిస్ మసూద్ గురువారం వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌కు సూచించారు.